కథానిక:

మొదటి నెల జీతం

"జాస్మిన్"

ఆశ్చర్యం! ఈరోజుల్లో ప్రతి చిన్న పిల్లడూ స్కూల్ ఫైనల్ పాసవుతున్నాడు. పన్నెండో యేటే ఇంటర్మీడియట్ చదువుతున్నవాళ్లున్నారు. పూర్వం పన్నెండేళ్ళ కొడుకు లున్న పెద్దమనుష్యులు ఇంకా మెట్రిక్కు లేకపోయేవారు. మొగవాళ్లేకాదు చిన్నచిన్న ఆడపిల్లలు కూడా పెద్దపెద్ద చదువులు చదువుతున్నారు. అధమం మెట్రిక్యులేషనైనా పాసవని పెళ్లికూతురు కనిపించ దెక్కడా. గొప్పవాళ్లలో ఆ మాత్రం చదువులేని ఆడపిల్లకి పెళ్ళి కానేకాదు.

ఇలాగ అతిసులభంగా అందరూ విద్యాపారంగతు లవడం చూసి. జాతిలో తెలివితేటలు అభివృద్ధిచెందుతున్నాయని కొందరంటున్నారు. చాలామంది ఒప్పుకుంటున్నారు. కాని రామయ్యని చూస్తే మనుష్యజాతియొక్క మేధాశక్తి నిజంగా పురోభివృద్ధి చెందుతూందని ఎవరూ అనుకోరు. రామయ్య కున్న తెలివితేటలే ఆధారంగా తీసికుంటే మానవజాతి శిలాయుగందాటి ఏ రెండడుగులో, మహా అయితే మూడు తప్పటడుగులో వేసి ఉంటుందనే అభిప్రాయం కలుగుతుంది.

రామయ్యకి చదువుచెప్పిన మాస్టర్లంతా, అతనికి 'తెలివి' అనే విలువైన వస్తువ భగవంతుడు ఏమరుపాటున ఇవ్వడం మర్చిపోయేడంటారు. అయితే జరిగినటువంటి ఈ పొరపాటుకి భగవంతుణ్ణి నిందించడానికి బదులు రామయ్యని చిన్నప్పట్నుంచీ ఇంట్లో పెద్దలూ, బడిలో పెద్దలూ అంతా నిందించడంతో చిన్నప్పుడు తన్నడం కూడా జరిగించేవారు. ఈ నిందలూ, తన్నులూ భరించలేనప్పుడు తనని పుట్టించిన భగవంతుణ్ణి రామయ్య మాత్రం తిడుతూఉండేవాడు. అసాధారణ మేధాశక్తి ప్రసాదించనందుకు రామయ్య నిందించినప్పటికీ భగవంతు డతణ్ణి కఠినపరీక్ష చేసి మెట్రిక్యులేషన్ పాస్ చేయించాడు. దేవుడిలా కఠినంగా పరీక్షించడంచేత రామయ్య మూడు సంవత్సరాలు స్కూలుఫైనల్ పరీక్షకి కూర్చొని మూడుసార్లూ తప్పేక మరి మూడు పర్యాయాలు మెట్రిక్యులేషన్ పరీక్షకి వెళ్లి ఆఖరిసంవత్సరం కాని కృతకృత్యుడు కాలేకపోయేడు. తెలివితేట లివ్వడం మర్చిపోయిన విధాత రామయ్యకి ఓర్పు పట్టుదలా కొంచెం హెచ్చుకోటా వేసి ఇచ్చేడు. "మొండిముండాకొడుకు కేలాగయితేనేం, సాధించేడయ్యా" అని అందరిచేతా మెప్పుపొందేడు రామయ్య.

గజనీమహమ్మదు భారతదేశంపైకి చాలా సార్లు దండెత్తేడట. రామయ్య కూడా ఏదో ఓరకంగా దండయాత్రలు చెయ్యడంచేత అతణ్ణి గజనీతో సరిపోల్చుతారు కొంతమంది సరిపోల్చడం సమంజసంగానే ఉంది. కాని ప్రతి దండయాత్రకీ రామయ్య పడ్డంత శ్రమపడవలసి వుంటే ఏ రెండుమూడుసార్లకన్న గజనీమహమ్మదు భరతవర్షాన్ని బాధించి ఉండకపోవచ్చును. ఎన్నిశ్రమలకైనా ఓర్చి పరీక్ష నెగ్గిన రామయ్య ఈ విషయంలో గజనీకన్న గట్టివాడనే చెప్పాలి.

పోలిక లున్నప్పటికీ, దండయాత్రల ఫలితాల్లో గజనీమహమ్మదు విషయంలోనూ, రామయ్యవిషయంలోనూ గొప్ప తేడా ఒకటున్నాది. సమరయాత్ర సాగించి గజనీమహమ్మదు కోట్లకొద్దీ ధనం కొల్లగొట్టుకుపోయేవాడు. రామయ్యకేసులో దండయాత్రలకయేది ఖర్చేకాని వచ్చేఫలితం ఏమీ లేదు. ఒక్కొక్క యాత్ర చేసి గొప్పవాడయేడు హమ్మద్ గజనీ; దండయాత్ర ఒక్కొక్కటీ చేసి బీదవాడయేడు రామయ్య.

అసలు డబ్బు విషయంలో రామయ్య ఎప్పుడూ గొప్పవాడు కాడు. ఎప్పుడూ బీదవాడయిన రామయ్యని దూరదూరంగా వున్న దరిద్రదేవత మెట్రిక్యులేషన్ పాసయేసరికి అమాంతంగా దగ్గరకొచ్చి కౌగలించుకుంది. ధనలక్ష్మి గాజుల గలగలారవమైనా ఎక్కడా వినిపించలేదు.

పరీక్ష పాసయేసరికి రామయ్య వయస్సు ప్రపంచంలో అందరితోపాటు ముదిరింది. అయితే సర్వీస్‌కమిషన్ పరీక్షకి కూర్చోడానికి ఇంకా టైముంది కూర్చోమని కొంతమంది సలహా ఇచ్చేరు. పరీక్ష కూర్చుంటే మరింక పైకి ఎన్నటికీ తేలడని రామయ్యని బాగా ఎరిగినవాళ్లంతా తేల్చేరు.

"అయితే గుండె దిట్టంచేసుకుని మిల్ట్రీలో చేర్రా అబ్బాయీ, అన్నివిధాలా బావుంటుంది" అని ఒహత నన్నాడు.

అవి యుద్ధపురోజులు. రామయ్యలాంటి వాళ్లకి కూడా సైన్యంలో ప్రవేశం ఉండే రోజులవి. "ఈసమయంలోనే వీడికి నాలుగురాళ్లు సంపాదించడానికి కవకాశం" అనుకున్నాడు రామయ్యతండ్రి. ఇంట్లో పెద్దలంతా సరేనంటే సరేనన్నారు. రామయ్య పెద్దల ఆశీర్వచనాలతో మిలిటరీజీవితానికి ప్రయాణంకట్టేడు.

ఇంట్లోఉన్న పెద్దలంతా ఏడుగురు. 1. తల్లి. 2. తండ్రి 3 నాయనమ్మ. 4 పూర్వం సువాసనతో ఉండే అక్క. 5. ప్రస్తుతం సువాసన గలిగిన అక్క. 6. పెద్దన్న. 7. చిన్నన్న. రామయ్య భారతసేనాబలానికి తన బలం చేర్చడానికి వెళ్లిన మర్నాడు రాత్రి భోజనా లయేక, వాకట్లో, వెన్నెల్లో, కుక్కిమంచాలు వేసుకూర్చుని, పడుక్కుని, చేర్లబడి రామయ్యభావి ధనలాభంగురించి మాట్లాడుకుంటున్నారు. ధనలాభంగురించి మాట్లాడేటప్పుడుండే సహజమైన ఉత్సాహం ప్రస్తుతపు సంభాషణలో హెచ్చుగా ఉన్నాది.

"తిండీ బట్టా పోను నెలకీ అరవైరూపాయి లిస్తారండీ వీడికి. డంగ్ సామ్మ! అందులోనూ మన ర తెలివితేటలు చూసి. భగవంతుడి దయవల్ల ఏదో నాలుగురాళ్లు సంపాదించుకుని బైటపడితే, ఆ మీదట మళ్ళీ ఉద్యోగం గవర్నమెంటు వాళ్లే వెదికి ఇప్పిస్తారట" అన్నాడు తండ్రి.

"అయితే జీతం అందగానే ఏమైనా ఇంటికి పమ్మించమని చెప్పేవా?" అనడిగిందినాయనమ్మ.

"చెప్పనూ. మొదటి నెలజీతం ఎలాగైనా పంపాలని గట్టిగా చెప్పేను. అటు తరవాత నెలల్లో కావాల్సొస్తే వాడి కవుసరం అయేదుంచుకుని మిగతాది పంపొచ్చునని కూడా అన్నాను. వాడికిమాత్రం తెలియదా ఏమిటి, ఇక్కడ బోలెడు ఖర్చు లున్నాయని"

పాపం చదువులో అంటే ఆట్టే అదృష్టం లేకపోయింది కాని మిగతావిషయాలన్నీ వాడికి తెలుసునమ్మ" అన్నాది తల్లి కొడుకు సుగుణాలు స్మరణకి తెచ్చుకుని.

"అయితే వచ్చేనెల అరవైరూపాయ లందుతాయన్న మాట మనకి" అంది పునిస్త్రీ అక్క.

"అందుతే సామ్మకి తగ్గ ఖర్చులేదూ? అరవైరూపాయలన్న మాటేమిటి. అరవై వేల రూపాయల ఖర్చుందనుకో" అన్నాడు తండ్రి, కూతురి కేమీ అందులో భాగం అందదన్న భావం స్ఫురించేలాగ.

"ఎల్లుండి దీపావళికి మా అల్లుడు కూడా వస్తారు కాబోలు. అన్ని ఖర్చుల్లోనూ ఇదో ఖర్చు" అన్నాది పునిస్త్రీ అక్క గడుసుగా.

ఇంతసేపూ పరధ్యానంగా ఉన్న చిన్నన్న హఠాత్తుగా అన్నాడు: "అయ్యో బావనిరమ్మని రాసిన ఉత్తరం పోస్టుచెయ్యడం మర్చిపోయేను. రేపు వేస్తే టైముకి అందుతుందో అందదో"

పునిస్త్రీ అక్క దీపావళినాడు పొందవలసిన దాంపత్యానుభవాలు దూరంగా పోయేయని బాధపడ్డాది మనసులో.

"టైము కందుతే పండుక్కి బావొస్తారని భయపడ్డావు కాబోలు" అన్నాది కోపంతో.

"బావ రాకపోయినా పంచెలచాపు కొని పంపిస్తాంలే" అన్నాడు పెద్దన్న.

"నువ్వు మహా కొనీసేవు, ఆయన కట్టుకున్నారు. నాకో చీరగుడ్డైనా కొనివ్వలేకపోయేవు నువ్వింతవరకూ. ఏమైనా ఇస్తే ఆ రామిగాడే ఇంకా ఇవ్వాలి"

"ఈనెల రామిగాడిజీతంలో ఏమీ కొనడానికి వీలుండద"న్నాడు తండ్రి. ఈ వాక్యంతో సంభాషణలో కొంత వేడి తగ్గినట్టయింది. అణా అరువుపెట్టి తెచ్చిన చుట్టల్లో ఒకటితీసి అంటించేడు తండ్రి.

"ఏం కొన్నా కొనకపోయినా వాడిది తాకట్టుపెట్టిన వెండిగిన్నె విడిపించకపోతే వీల్లేదండీ" అన్నాది తల్లి.

"చూద్దాం" అన్నాడు తండ్రి.

"అన్నట్టు కరణందగ్గ రవేళరూపాయి బదులు తెచ్చేను. ఇంకా ఇవ్వలేదే" అన్నాది పూర్వసువాసిని.

...య్యనలేదుగాని, నేనవేళ తెస్తే పాలమనిషి కిచ్చేవు"

"ఏ పాలమనిషి?"

"మన పాలమనిషి"

"నాకు జ్ఞాపకం లేదుసామ్మ"

"నువ్వు మర్చిపోతే కరణం మర్చిపోతాట్టే"

"కరణం అంటే జ్ఞాపకం ఒచ్చింది. వాడి తల్లి మొన్నె కాశీ వెళ్ళొచ్చిందిరా" అన్నాది నాయనమ్మ.

"డబ్బంటే ఏ గంగలో కలవడానికైనా వెళ్ళొచ్చు" నన్నాడు పెద్దన్న.

"రామిగాడు సొమ్ము పంపిస్తే సింహాచలమైనా వెళ్ళిరావా" లన్నాది నాయనమ్మ.

"అక్కడంతా మిలిటరీవాళ్లున్నారు. ఇప్పుడు వెళ్ళడం మంచిది కాదు".

"ముసలిముండని నన్నేం చేస్తార్రా వాళ్లూ".

"నువ్వొక్కత్తివే వెళ్తావా ఏమిటి, నేను మాత్రం రానూ" అన్నాది భర్తృవియోగిని.

"అన్నట్టు సింహాచలంలో చంటివాడికి పుట్టుజుత్తులు తీయించాలి" అన్నాది పునిస్త్రీ అక్క.

"ఏడాది నిండలేదుకదూ వాడికి. ఇంకాచాలా టైముంది. తీయించడానికి" అన్నారొకరు.

"పుట్టుజుత్తులు పోతే పోయిరి. నాకో గుడ్డముక్కైనా కొనివ్వవుట్రా" అని నాయనమ్మ మనుమడితండ్రి నడిగింది.

పూర్వసువాసిని అందుకుంది. "రెండేళ్ళ క్రిందట కామోసు నాకీ నైనుపంచ కొన్నారు. ఎలా పేలిక లయిపోతోందో చూడు."

"మీరేం కట్టుకున్నా ఎవడూ అడిగేవాడుండడు. నా చీరెలా ఉందో చూడండి అలుగుడ్డలాగ" అంటూ వెన్నెల వెలుగులో చీరని సభాసదులకి చూపించింది పునిస్త్రీ అక్క.

"నీ కేమే నెల కోచీర కొంటూనే ఉంటాడు నీమొగుడు చక్కా. నా కెవడిస్తాడు. ఆ రామిగాడేమైనా కొంటే కట్టుకోవాలి. లేకపోతే ఇహ నిలా ఉండవలసిందే" అని భర్తృవిహీనురాలు ముందుకి వస్త్రవిహీనురాలుగాకూడా ఉండవలసివస్తుందని వాపోయింది.

"ఫస్టుతారీకు రానీయండి. అన్నీ చూసుకుందాం" అన్నాడు తండ్రి కళ్లుమూసుకు పడుక్కుంటూ.

ఫస్టుతారీకు రాకుండానే విశాఖపట్నం నుంచి రామయ్య ఉత్తరం రాసేడు.

"ఇక్కడ మెడికల్ పరీక్ష చేసి నేను మిలిటరీకి పనికిరానననీసేరు. అందుచేత ఈ వూళ్లోనే వేరే ఏమైనా చూసుకోవాలి. ప్రస్తుతం నాదగ్గిర దమ్మిడీ లేదు. ఈ ఉత్తరమే టెలిగ్రాంగా భావించి నాకు వెంటనే అధమం పాతిక రూపాయిలైనా పంపగోరుతున్నాను".

ఆవేళ పొరుగింటివాళ్ళతో నాయనమ్మ చెప్పింది.

"మా మనవడికి అక్కడేదో పరీక్ష చేసేరుటమ్మ. అదేం కర్మమో. పరీక్షల్లో ఎప్పుడూ వాడు తప్పడమే. నష్టజాతకానికిమన వేంచేస్తాం"

బసవశంకరుని పదములు, తిరుకోవులూరిపదములు, చంద్రశేఖరునిపదములు, శోభనగిరివారి పదము (అచ్చువల్లి వారిపదము, వరహానిపదము, తిరుక్కణమంగవారిపదము, ఉమామహేశ్వరుని పదము, కల్యాణవరదునిపదము, అరియపురి కోదండరాముని పదము. కరిగిరివరదుని పదము, తొరయూరిమదనగోపాలపదము, సహదేవపురి వారిపదము, ఏకామ్రపతి పదము, ప్రసన్నగుడియాతిపు చెన్నుని పదము, దామెర ముద్దువెంకటభూపాలుని పదములు కలవు. ప్రాచీనకాలమున ప్రజాసామాన్యము పదరచనములకు బ్రహ్మరథము పట్టుచుండి రనుటను ఈ పదరచనములు ధ్రువపఱచుచున్నవి. పురాతన పదరచయితలచే రచియింపబడి చెదరులు చెదరులుగా నున్న యీ పదరచనము లెల్ల నొక సంపుటముగా ముద్రింపదగినవి. ఈపదరచనములు ప్రజాసామాన్యమునకు విద్యావినోదముతో సాహిత్యాభిరుచిని, కళాభిజ్ఞతను గలిగించుచు ననితరానందసంపాదకములయి నిత్యనవీనములయి వెలయు చున్నవి.



స్థానికసంస్థల మంత్రి గా॥ కల్లూరి చంద్రమౌళిగారిని తెనాలి పురపాలకసంఘం సన్మానించినప్పటి దృశ్యం. మంత్రిగారికి కుడివైపున చైర్మన్ నన్నపనేని వెంకటరావు, ఎడమవైపున తెనాలిడిప్యూటి కలెక్టరు జి. రామమూర్తి పంతులుగార్లు గలరు.